


ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజుకు అసెంబ్లీలో చాంబర్ కేటాయింపు

అభినందనలు తెలిపిన స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలు

ముమ్మిడివరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజుకు గురువారం అసెంబ్లీలో నూతన చాంబర్‌ను కేటాయించారు. శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ముఖ్య అతిథులుగా విచ్చేసి చాంబర్‌ను ప్రారంభించారు. చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఇతర విప్‌లు, మంత్రి పి.నారాయణ, ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యేలు కాల్వ శ్రీనివాసులు, బొలిశెట్టి శ్రీనివాస్, పర్సనల్ సెక్రటరీ సుబ్బరాజు చాంబర్‌కు విచ్చేసి ప్రభుత్వ విప్ సుబ్బరాజును అభినందనలు తెలియజేశారు.



చాంబర్‌లో ప్రభుత్వ విప్ దాట్ల



అభినందనలు తెలియజేస్తున్న స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలు

కాత్యాయనీదేవిగా దర్శనం

దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా నాల్గోరోజు గురువారం దుర్గమ్మ భక్తులకు జిల్లాలోని పలు ఆలయాల్లో కాత్యాయనీ దేవిగా దర్శనం ఇచ్చారు. అమలాపురం శ్రీదేవి మార్కెట్ సెంటర్‌లోని శ్రీదేవి అమ్మవారు కాత్యాయనీదేవిగా అలంకరణలో దర్శనమిచ్చిన దృశ్యమిది..



6 వే!



(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

4 ఆప్షన్‌కే మొగ్గు..

ఆరులైన్ల విస్తరణకు సంబంధించి డీపీఆర్ నివేదికలో నాలుగు రకాల అలైన్‌మెంట్ ఆప్షన్లు విశ్లేషించారు. ఆప్షన్ 1 ఎంచుకుంటే ఆరులైన్ల విస్తరణకు ఉమ్మడి జిల్లా పరిధిలో సుమారుగా రూ.2,300 కోట్లు,ఆప్షన్ 2 కింద రూ.4,200 కోట్లు, ఆప్షన్ 3 కింద రూ.6,700 కోట్లు, ఆప్షన్ 4 కింద రూ.6,230 కోట్లు వ్యయం కానున్నట్టు గుర్తించారు.అనకాపల్లి నుంచి దివాన్‌చెరువు కింద 160 కిలో మీటర్ల మేర ఆరు లైన్ల విస్తరణ ఖర్చు ఆప్షన్ 4 అలైన్ మెంట్‌కు రూ.10,233 కోట్లు వ్యయం కానున్నట్టు అంచనా . ఆప్షన్1 కింద రూ.4,586 కోట్లు, ఆప్షన్2 కింద రూ.7577 కోట్లు, ఆప్షన్ 3 రూ.10,760 కోట్లు ఖర్చవుతుందని తేల్చారు. అధికారులు నాలుగో ఆప్షన్‌కే మొగ్గు చూపుతు న్నారు. దీన్ని ఎంపిక చేస్తే ఇబ్బందుల్లేకుండా ప్రాజెక్టు పట్టాలెక్కించవచ్చని భావిస్తున్నారు. అలైన్‌మెంట్ ఆప్షన్లపై స్టేక్ హోల్డర్ల సమావేశాల్లో చర్చించి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దీని ప్రకారం కేంద్రానికి ఎన్‌హెచ్ అధికారులు నివేదిక పంపుతారు. దీన్ని పరిశీలించిన తర్వాత కేంద్రం ఏ అలైన్ మెంట్‌కు ఆమోదముద్ర వేస్తుందనేది చూడాలి. ఈ ప్రక్రియ పూర్తిచేసుకుని హైవే విస్తరణకు టెండర్లు పిలవడానికి మరికొంత సమయం పట్టనుంది.

తుని-దివాన్‌చెరువు మధ్య ఆరులేన్లుగా హైవే

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మీదుగా ప్రయాణించే చెన్నై-కోల్‌కతా 16వ నెంబరు జాతీయ రహదారికి ఎట్టకేలకు మంచిరోజులు వచ్చాయి. ఎన్నాళ్లగానో ఎదురుచూస్తోన్న ఆరు వరుసల హైవే విస్తరణకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ప్రస్తుత నాలుగు లైన్ల హైవే అత్యంత రద్దీగా మారడం.. బ్లాక్‌స్పాట్‌లు అధికమై తరచూ ప్రమాదాలకు నిలయంగా మారడంతో ఆరులైన్లకు విస్తరించేందుకు ఎన్‌హెచ్ అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు హైవే విస్తరణకు సంబంధించి తాజాగా డీపీఆర్ సిద్ధమైంది. కాకినాడ జిల్లా తుని పట్టణం నుంచి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరం సమీపంలోని దివాన్‌చెరువు జంక్షన్ వరకు మొత్తం 91 కి.మీ. మేర విస్తరణకు అధికారులు ప్రణాళికలు సిద్ధంచేశారు. విస్తరణ ప్రాజెక్టులో ఆప్షన్1 అలైన్‌మెంట్ ఖర్చు రూ.2,500 కోట్లు అవుతుండగా.. ఆప్షన్ 4 కింద ఖర్చు రూ. 6,230 కోట్ల వరకు వ్యయం కానుంది. విస్తరణకు సంబంధించి 8 చోట్ల ఫ్లయ్ ఓవర్లు నిర్మించనున్నారు. అయితే హైవే వెంబడి అనేక గ్రామాలు ఉన్నందున కొన్నిచోట్ల బైపాస్ ప్రతిపాదించారు. ప్రాజెక్టు వ్యయం ఎక్కువే అయినా నాలుగో ఆప్షన్‌కే అధికారులు మొగ్గుచూపుతున్నారు. దీన్ని కేంద్రం పరిశీలించి ఆమోదించిన తర్వాత విస్తరణ పనులకు టెండర్లు పిలవనున్నారు.

ఆరు లైన్లకు ఇదే కారణం..

కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల మీదుగా ప్రయాణించే చెన్నై- కోల్‌కతా 16వ నెంబరు జాతీయరహదారి నిర్మించి దాదాపు పాతికేళ్లపైనే అవుతోంది. ప్రస్తుతం ఉన్న నాలుగు లైన్ల హైవే పూర్తిగా రద్దీగా మారిపోయింది. రహదారిని నిర్మించినప్పుడు అంచనా వేసిన పీక్ ట్రాఫిక్ స్థాయి దాటి వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. తుని నుంచి దివాన్‌చెరువు వరకు ఉన్న హైవే పరిధిలో ప్రమాదాలకు ఆస్కారం ఉన్న బ్లాక్‌స్పాట్‌ల సంఖ్య విపరీతంగా పెరిగిపో యింది.ఈ నేపథ్యంలో ప్రస్తుత హైవేను ఆరులైన్లుగా విస్తరించాలనే ప్రతిపాదన ఎన్నో ఏళ్లగా ఉంది. అయితే నాలుగు లైన్ల వెంబడి తుని నుంచి దివాన్‌చెరువు వరకు అనేక గ్రామాలు,పట్టణాలు విస్తరించి భారీ వాణిజ్య భవనాలు వెలిశాయి. దీంతో ఆరు లైన్లను ఎలా విస్తరించాలనే దానిపై అధ్యయనం చేసి నివేదిక సిద్ధం చేసే బాధ్యత ఆర్కిటెక్నో, ధృవ్ కన్సల్టెన్సీలకు అప్పగించింది.

హైవే విస్తరణ ఇలా..

విస్తరణకు సంబంధించి కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా పరిధిలో తుని, శంఖవరం, తొండంగి, గొల్లప్రోలు,ప్రత్తిపాడు, జగ్గంపేట, ఏలేశ్వరం, గండేపల్లి మండలాల పరిధిలోని తుని, చేపూరు, తేటగుంట, అరెంపూడి, పీఈ చిన్నయ్యపాలెం, సీతాయంపేట, ప్రత్తిపాడు, జగపతినగరం, సోమవరం, బూరుగుపూడి, రామవరం, రాగం పేట,తాళ్లూరు, బొర్రంపాలెం, మల్లేపల్లి, గండేపల్లి, మురారి, కల్వచర్ల, రాజానగరం, జగన్నాథపురం, వెంకటపురం, నరేంద్రపురం, వెలుగు బంద గ్రామాల మీదుగా కొత్త లైన్ల వరుస నిర్మాణం జరగనుంది. కాకినాడ జిల్లా పరిధిలో తాండవ నది, అన్నవరం బైపాస్, ఎర్ర కాలువ వద్ద మూడు బ్రిడ్జిలు ప్రతిపాదించారు. తుని పరిధిలోని తిమ్మాపురంలో రైల్వే లైన్ నేపథ్యంలో ఆర్వోబీ ప్రతిపాదించారు. తూర్పుగోదావరి జిల్లా పరిధిలో కాకినాడ ఏడీబీ రోడ్డు, కోరుకొండ, రాజానగరంతో పాటు కాకినాడ జిల్లాలో 11 చోట్ల మేజర్ క్రాసింగ్‌లు గుర్తించారు. కాకినాడ జిల్లా పరిధిలో చేపూరు, ఎర్రవరం, బూరుగుపూడి, రామవరం, తాళ్లూరు, మల్లేపల్లి, గండేపల్లి, మురారి తదితర చోట్ల 8 ఫ్లయ్ ఓవర్లు నిర్మించాల్సి ఉంటుందని ప్రతిపాదించారు. తేటగుంట, దివాన్‌చెరువు పరిధిలో మూడు కిలో మీటర్ల మేర రిజర్వు ఫారెస్ట్ మీదుగా రహదారి నిర్మించాల్సి ఉంటుందని గుర్తించారు.

- ప్రస్తుతం నాలుగు లైన్లు
- ఆరులైన్లుగా డీపీఆర్ సిద్ధం
- 4 రకాల అలైన్‌మెంట్ ఆప్షన్లు
- కాకినాడ జిల్లాలో 80 కి.మీ
- తూ.గో. జిల్లాలో 11 కి.మీ
- వ్యయం రూ.6,230 కోట్లు
- 8 చోట్ల ఫ్లయ్ ఓవర్లు
- 3 చోట్ల బ్రిడ్జిలు
- 14 చోట్ల మేజర్ క్రాసింగ్‌లు
- త్వరలో కేంద్రం టెండర్లు

దాదాపు రెండున్నరేళ్లు ఈ సంస్థలు అధ్యయనం చేసి ఎట్టకేలకు నాలుగు రకాల అలైన్‌మెంట్ ఆప్షన్లతో డీపీఆర్ సిద్ధం చేశాయి. కాకినాడ జిల్లాలో 80 కిలోమీటర్లు, తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 11 కి.మీ.మేర ఆరులైన్ల విస్తరణ పనులు చేపట్టాలంటే ఒక్కో ఆప్షన్ కింద ఎంత వ్యయం అవుతుందో నివేదికలో విశ్లేషించాయి.





అమలాపురం పట్టణంలోని సర్క్యులర్ బజార్ వద్ద స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, జేసీ.. స్వచ్ఛత హి సేవ ముగ్గును పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ

అమలాపురంలో స్వచ్ఛత హి సేవ

కలెక్టర్, జేసీ హాజరు

అమలాపురం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత హి సేవా కార్యక్రమం ద్వారా పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా పట్టణాలు, గ్రామాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుకోవచ్చని కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. అమలాపురం పురపాలక సంఘ పరిధిలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా సర్క్యులర్ బజార్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ శ్రమదానం చేశారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, రెవెన్యూ డివిజనల్ అధికారి మాధవి, మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్, కౌన్సిలర్లు, మున్సిపల్ ఉద్యోగులతోపాటు వివిధ పక్షాల నాయకులు సర్క్యులర్ బజార్ ముందు శ్రమదానం చేశారు. తొలుత పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. పాల్గొన్నవారితో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛతపై ప్రజల్లో చైతన్యం కల్పించడం, సంఘటితంగా పనిచేయడం ద్వారా పరిసరాల పరిశుభ్రతను ప్రోత్సహించాలని సూచించారు. అక్టోబరు 2వ తేదీ వరకు కార్యక్రమాలను పెద్దఎత్తున చేపట్టాలని విజ్ఞప్తిచేశారు. మున్సిపల్ ఉద్యోగులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

శాంతి భద్రతల విషయంలో రాజీ పడేదిలేదు : ఎస్పీ



కొత్తపేట,సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతిభద్రతల విషయంలో రాజీపడేదిలేదని ఎస్పీ రాహుల్ మీనా అన్నారు. గురువారం కొత్తపేట పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరును ఎస్ఐ జి.సురేంద్రను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరుపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తామన్నారు. ఎస్ఐ జి.సురేంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మండపేట పట్టణంలో సాయి ఆర్థోపెడిక్ ఆసుపత్రి పైభాగంలో అనధికారికంగా వేసిన స్లాబును కూల్చివేస్తున్న దృశ్యం

మండపేటలో అనధికార అంతస్తు కూల్చివేత

మండపేట, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణంలో ఉన్న సాయి ఆర్థోపెడిక్ ఆసుపత్రి భవనంపై అనుమతి లేకుండా నిర్మిస్తున్న అదనపు అంతస్తును పట్టణ ప్రణాళిక శాఖ అధికారులు గురువారం కూల్చివేశారని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి, మున్సిపల్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల మేరకు పట్టణంలో అనధికారిక నిర్మాణాలు కూల్చివేత పనులు చేపట్టామని కమిషనర్ తెలిపారు. పట్టణంలో అనధికారిక నిర్మాణాలు ఎవరు చేసినా కూల్చివేత తప్పదని ఆయన హెచ్చరించారు. గురువారం నాటి ఘటనతో అక్రమ నిర్మాణదారుల గుండెల్లో గుబులు ప్రారంభమైంది. ఇప్పటికే పట్టణంలో అనధికారిక నిర్మాణాలు, బహుళ అంతస్తుల భవనాలు ఇబ్బడి ముబ్బడిగా నిర్మించేశారు. రెసిడెన్షియల్ ముసుగులో వ్యాపార సముదాయాలూ నిర్మించుకున్న వారు ఉన్నారు. రోడ్డుపక్క ఆక్రమణలు కూడా అన్ని వార్డుల్లో పెరిగిపోయాయి. ఒకటి వదిలి.. మరొకటి తొలగించడం చేయకుండా పట్టణంలో పూర్తి స్థాయిలో ఆక్రమణలు తొలగించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం ప్రజల నుంచి వినిపిస్తోంది. ఇప్పటికే పట్టణ ప్రణాళిక విభాగంలో సచివాలయ ఉద్యోగులు కొందరు చక్రం తిప్పుతున్నారు. దీంతో అక్రమ నిర్మాణాలు తొలగింపుపై పారదర్శకతపై అనుమానాలు ఉన్నాయి.

టెంపుల్ టూరిజం సర్క్యూట్‌కు ప్రణాళికలు సిద్ధం చేయండి : కలెక్టర్



కలెక్టరేట్‌లో టూరిజం జిల్లా కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పురాతనమైన, ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాలతో ప్రసిద్ధి చెందిన దేవాలయాలను టెంపుల్ సర్క్యూట్ టూరిజం ప్యాకేజీ ద్వారా అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు కలెక్టర్ మహేష్‌కుమార్ గురువారం అమలాపురంలోని కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి టూరిజం కౌన్సిల్ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. అంతర్వేది, అయినవిల్లి, అప్పనపల్లి, వాడపల్లి, మురమళ్ల, మాస్టర్ ప్లాన్ రూపొందించి టెంపుల్ సర్క్యూట్ టూరిజం అభివృద్ధికి చర్యలు కొనసాగుతున్నాయన్నారు. ఆగమన శాస్త్రం, మాడా వీధులు, సైన్ బోర్డులు దేవాలయాల్లో పర్యాటకుల సందర్శన, పార్కింగ్, రద్దీ నిర్వహణ, అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా వసతులతో కూడిన మాస్టర్ ప్లాన్‌ను సమగ్రంగా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు అనుభవజ్ఞులైన గైడ్‌లను నియమించాలని దేవదాయశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అంతర్వేది లైట్ హౌస్ వద్ద పర్యాటకులకు అనువైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు దేవదాయశాఖ తొమ్మిది ఎకరాల స్థలాన్ని కేటాయించినట్టు చెప్పారు. లొల్ల లాకుల వద్ద 6.7 ఎకరాలు ఉందని, వాడపల్లి వద్ద దేవాలయ భూమి 3.10 ఎకరాలు ఉందన్నారు. లొల్ల లాకుల వద్ద గట్టు, తదితర ఆధునికీకరణ పనులకు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు తెలిపారు. ఆదుర్రు, పాశర్లపూడిలో మద్యం బార్ ఏర్పాటుకు స్థానికులకు ఎక్సైజ్ శాఖ లైసెన్సు మంజూరు చేయాలని సూచించారు. మలికిపురం మండలం తూర్పుపాలెంలో అడబాల వీరన్న భవనం, హోంస్టే కోసం ఎంపిక చేయడం జరిగిందని, ప్రపంచ పర్యాటక దినోత్సవం రోజున ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మండువా లోగిళ్లు, నూతన కట్టడాలతో పర్యాటలకు విడిది కల్పించే చర్యలు చేపట్టాలన్నారు. త్వరలో హోంస్టే పాలసీని జిల్లాలో అమలుచేయడానికి చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. గోదావరి, సముద్ర తీరం వెంబడి పర్యాటకరంగ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని సూచించారు. టెంపుల్ సర్క్యూట్ టూరిజం, బోటింగ్ టూరిజంకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. పర్యాటక రంగం ద్వారా ప్రజలకు ఆహ్లాదంతోపాటు యువతకు ఉపాధి కల్పించవచ్చని కలెక్టర్ మహేష్‌కుమార్ సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో కె.మాధవి, ఆర్డీవోలు శ్రీకర్, జిల్లా టూరిజం అధికారి అన్వర్, డీఆర్డీఏ పీడీ జైచంద్రగాంధీ, జలవనరుల శాఖ ఈఈ వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలు వినియోగదారులకు అందాలి

అవగాహనా సమావేశాలు నిర్వహించాలి : కలెక్టర్

వివిధ శాఖల అధికారులతో సమీక్ష



జీఎస్టీ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఈనెల 22 నుంచి అమలుచేస్తున్న జీఎస్టీ పన్నును తగ్గించి న్యాయమైన ధరలకు వస్తువులు విక్రయాలు జరిగేలా కార్యాచరణ ప్రణాళికలు అమలుపై దృష్టిపెట్టాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. జీఎస్టీ ప్రయోజనాలు వినియోగదారులకు చేరేలా అన్ని స్థాయిల్లోను పర్యవేక్షించాలని గురువారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లాస్థాయి అధికారులు, జీఎస్టీ సంస్కరణ అమలుపై కమర్షియల్ ట్యాక్సు డిప్యూటీ కమిషనర్ జీఎస్టీ 2.0 కోనసీమ నోడల్ అధికారి సీహెచ్ రవికుమార్‌తో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర వస్తువులపై పన్నులు గణనీయంగా తగ్గించబడ్డాయని, ముఖ్యంగా వ్యవసాయ యంత్రాలు, ఆరోగ్య, విద్యా సేవలకు తక్కువ జీఎస్టీ వర్తింపజేస్తున్నారని, ఇంటి పరికరాలపై కూడా జీఎస్టీ తగ్గిందన్నారు. జిల్లా స్థాయిలో వాణిజ్య పన్నులశాఖ అధికారులు ఈ మార్పులపై పన్ను చెల్లింపుదారులతో అవగాహన సమావేశాలు నిర్వహించాలని, ఎక్కువగా ఎంఎస్ఎంఈలు, రైతులు, పారిశ్రామికవేత్తలకు తగ్గింపు సంస్కరణలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయన్నారు. జీఎస్టీ సంస్కరణ అమలులో అధికారులు, వాణిజ్య పన్నులశాఖ అధికారులు ముఖ్య పాత్ర పోషించి ఆ లబ్ధిని ప్రజలకు అందించాలని సూచించారు. వ్యవసాయ ఆధారిత జిల్లాగా ఉన్న కోనసీమలో వ్యవసాయం, ఉద్యాన రంగాల్లో మరింత అవగాహనను కల్పించాలని పేర్కొన్నారు. అలాగే ఔషధాలపై జీఎస్టీని జీరోగా నిర్ణయించినట్టు తెలిపారు. ప్రతీ స్థాయిలో పర్యవేక్షణ వ్యవస్థ బలోపేతమై వ్యాపారులుజారీ చేస్తున్న బిల్లులను పరిశీలించి జీఎస్టీ తగ్గిందీ లేనిదీ చూడాలని సూచించారు. జిల్లాలో వస్తువుల కొనుగోలుపై ఎక్కడా ఫిర్యాదులు ఉత్పన్నం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జేసీ టి.నిషాంతి, డీఎస్వో వి.ఉదయభాస్కర్, ఏపీడీసీఎల్ ఎస్ఈ బి.రాజ్యలక్ష్మి, వ్యవసాయశాఖ అధికారి బోసుబాబు, మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, కమిషనర్ నిర్మల్‌కుమార్, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపండి : కలెక్టర్

అమలాపురం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): శిథిలావస్థకు చేరిన వంతెనల పునఃనిర్మాణానికి, వచ్చే పుష్కరాల నిర్వహణకు అవసరమైన అభివృద్ధి ప్రతిపాదనలకు ఓఎన్జీసీ భారీ వాహనాలు రాకపోకలు సాగించే రోడ్ల నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆర్‌అండ్‌బీ అధికారులతో సమావేశం నిర్వహించి శాఖాపరంగా చేపట్టిన పనుల్లో అమలు పురోగతిని, పెండింగ్ ప్రతిపాదనల అంశాలపై సమీక్షించారు. గత ఆర్థిక సంవత్సరంలో మంజూరైన నిధులు, మరమ్మతు పనులపై ఆరాతీశారు. నాబార్డు గ్రాంటు ద్వారా మంజూరైన పనుల పురోగతిని తెలుసుకున్నారు. జిల్లాలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే రోడ్ల అభివృద్ధికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈదరపల్లి వంతెన వద్ద జంక్షన్ అభివృద్ధి అక్టోబరు నెలాఖరునాటికి పూర్తిచేయాలని సూచించారు. నడిపూడి వద్ద నిర్మించిన వంతెనకు అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టి ట్రాఫిక్ రద్దీని నియంత్రించాలని సూచించారు. నియోజకవర్గాల వారీగా రోడ్ల నిర్మాణ పనులకు సంబంధించి మ్యాపింగ్ చేస్తూ ప్రధాన రోడ్లకు ప్రతిపాదనలకు త్వరితగతిన నిధులు మంజూరయ్యేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఆర్‌అండ్‌బీ ఎస్ఈ బి.రాము తదితరులు పాల్గొన్నారు.

శంకరగుప్తం డ్రెయిన్ మరమ్మతులకు బడ్జెట్ కేటాయించాలి

ఎమ్మెల్సీ సోము



మలికిపురం,సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మలికిపురం మండలంలోని శంకరగుప్తం డ్రెయిన్ తీర ప్రాంత గ్రామాలు భవిష్యత్తులో ఎడారిగా మారనున్నాయని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు శాసనమండలి దృష్టికి తెచ్చారు. రాజోలు నియోజకవర్గంలోని మలికిపురం మండలంలో పది గ్రామాలు డ్రెయిన్ బారినపడిన సముద్రపు నీరు పోటు కారణంగా ఆయా గ్రామాల్లో లక్షలాది కొబ్బరిచెట్లు తగ్గిపోయాయని సభలో ప్రస్తావించారు. చెట్లు ఎండిపోయి చనిపోవడంతో ఇతర పంటలు పండించుకునే అవకాశం లేకుండా పోయిందన్నారు. భూగర్భ జలాలు ఉప్పుగా మారి తాగునీరు దొరక స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈప్రాంత రైతులు అనాదిగా కొబ్బరి తోటలపై ఆధారపడి జీవిస్తున్నారని, కొబ్బరి పంటపై ఆదాయం ఆగిపోవడంతో ఆర్థిక సమస్యలతో సతమతం అవుతున్నారన్నారు. ఈ డ్రెయిన్ మరమ్మతులకు ప్రభుత్వం బడ్జెట్ కేటాయించాలని, సముద్రపు నీటి పోటును నివారించే స్థిరమైన చర్యలు తీసుకోవాలని పాడైపోయిన భూములకు పునరుద్ధరణ, తాగునీటి సమస్యకు తక్షణం పరిష్కారం చూపాలని సభలో కోరారు.

వైభవోపేతం...మహాశక్తి యాగం

40 కోట్లకు చేరిన లలితా సహస్ర కుంకుమార్చన

పాల్గొన్న 15 వేలమంది భక్తులు


సామూహిక లలితా సహస్ర కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు


అమ్మవారికి ప్రత్యేక అలంకరణ

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ రమణయ్యపేటలోని శ్రీపీఠం గోశాల ప్రాంగణంలో 3వ మహాశక్తి యాగం వైభవోపేతంగా సాగుతోంది. గురువారం మూడు పర్యాయాలు పఠించిన లలితా సహస్రనామ పారాయణలో సుమారు 15 వేలమంది భక్తులు పాల్గొన్నారు. ప్రముఖ విద్వాంసుడు నాగరాజు వేణుగానంతో అమ్మను స్తూతిస్తూ భక్తులను పులకింపచేశారు. స్వామి పరిపూర్ణానంద సరస్వతి భక్తులకు అనుగ్రహ భాషణ చేశారు. నాలుగు రోజుల్లో 40 కోట్ల లలితాసహస్రనామ కుంకుమార్చన పూర్తయ్యిందన్నారు. అయోధ్య నుంచి బాలరాముడు, బంగారు ధనుస్సు, ఐదు కలశాలను ఇక్కడకు తీసుకువస్తున్నారని, శుక్రవారం వీటిని భక్తులు తిలకించే అవకాశాన్ని అమ్మ కల్పిస్తోందన్నారు. ఈనెల 29న త్రికోటి మహాసరస్వతి పూజ నిర్వహిస్తామన్నారు. మూడేళ్ల బాలుడు హన్సిదేవ్ ఆలపించిన హనుమాన్ చాలీసా, లలితా సహస్రనామ పారాయణ ఆకట్టుకున్నాయి. సుమారు 30వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. ఉదయం రుత్వికుల ఆధ్వర్యంలో అమ్మవారికి గాయత్రి సౌర, అన్నసూక్త అన్నపూర్ణ హోమం, సహస్ర చండీ, సహస్ర రుద్ర, బగళాముఖి, వారాహి, పత్యంగిరా, వటుక, బైరవ హోమాలను పలు రకాల విశేష ద్రవ్యాలతో నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త అనంతలక్ష్మి పాల్గొన్నారు. సర్పవరం సీఐ బి.పెద్దిరాజు, ట్రాఫిక్ సీఐ డి.రామారావు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

విజయవాడ దుర్గమ్మకు అన్నవరం దేవస్థానం సారె


విజయవాడ దుర్గమ్మకు సారె సమర్పిస్తున్న అన్నవరం ఈవో, ఇతర అధికారులు

అన్నవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల సందర్భంగా విజయవాడ కనకదుర్గమ్మకు అన్నవరం దేవస్థానం తరుపున గురువారం ఈవో సుబ్బారావు, దేవస్థానం ప్రధానార్చకులు, ఇతర అధికారులు పట్టువస్త్రాలు, సారెను సమర్పించారు. ఏటా దసరా ఉత్సవాల్లో అమ్మవారి సోదరుడిగా సత్యదేవుడి తరుపున పట్టువస్త్రాలు అందించడం, స్వామివారి వార్షిక కల్యాణాలకు విజయవాడ దేవస్థానం నుంచి అన్నవరం దేవస్థానానికి పట్టువస్త్రాలు తీసుకు రావడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా అన్నవరం దేవస్థానం అధికారులకు విజయవాడ దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈవో వెంట ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, ఏఈవో భాస్కర్, సూపరెంటెండెంట్ రామకృష్ణ, అన్నవరం దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంటా విష్ణు, ఏపీఆర్వో గణపతి తదితరులున్నారు.

శారదాదేవిగా రత్నగిరి దుర్గలు

అన్నవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నాల్గోరోజైన గురువారం రత్నగిరి దుర్గలైన వనదుర్గ, కనకదుర్గలు శారదాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేషపూజలు, కుంకుమార్చనలు రుత్విక్‌లు నిర్వహించారు.


శారదాదేవిగా దర్శనమిస్తున్న కనకదుర్గ

సీపీఐ జాతీయ సమితి సభ్యుడిగా మధు



రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ సమితి సభ్యుడిగా తూర్పుగోదావరి జిల్లా సీపీఐ కార్యదర్శిగా వ్యవహరిస్తున్న తాటిపాక మధు ఎన్నికయ్యారు. ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకూ చండీఘడ్‌లో జరిగిన సీపీఐ 25వ జాతీయ మహాసభల సందర్భంగా గురువారం సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా నూతన జాతీయ సమితిని ప్రతిపాదించగా మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ నుంచి తాటిపాక మధును జాతీయ సమితి సభ్యుడిగా ఎన్నుకున్నారు. ఈ మేరకు మధుకు పలు ప్రజాసంఘాల నాయకులు, వివిధ రంగాల ప్రముఖులు ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పార్టీ కార్యదర్శిగా ఉన్న సమయంలో పేదలకు ఇళ్ల స్థలాలతో పాటు అనేక భూ పోరాటాలు చేశామని, జాతీయ సమితి సభ్యుడిగా తాను ఎన్నిక కావడం మరింత బాధ్యతను పెంచిందని ఈ సందర్భంగా మధు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యుత్‌షాక్‌తో మహిళ మృతి

ఆత్రేయపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్‌తో మహిళ చికిత్స పొందుతూ మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్రేయపురం మండలం పేరవరం గ్రామానికి చెందిన కొమ్మరి స్వర్ణకుమారి(45) ఈ నెల 18న తన ఇంటి డాబాపై ఆరవేసిన దుస్తుల తీస్తున్న సమయంలో డాబాకు ఆనుకుని విద్యుత్ వైర్లపై ఉన్న పక్షులు ఒక్కసారిగా ఎగరడంతో విద్యుత్‌వైర్లు కుమారికి తగిలి షాక్‌కు గురైంది. తీవ్రగాయాలైన ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందింది. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎస్ రాము తెలిపారు.

తాపీమేస్త్రికి గాయాలు

పి.గన్నవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలంముంగండ గ్రామదేవత శ్రీముత్యాలమ్మ ఆలయ సమీపంలో ఒక ఇంటిపై పనులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు 11 కెవి విద్యుత్ తీగలు తగలి తాపీమేస్త్రీకి తీవ్ర గాయాలయ్యాయి. బోర్రా శ్రీనివాస్‌కు సంబంధించిన బిల్డింగ్ రెండో అంతస్తులో పోతవరం గ్రామానికి చెందిన తాపీమేస్త్రీ గోసంగి శ్రీనివాస్ సింమెంట్ పనులు నిర్వహిస్తున్నాడు. ఇనుప ఊచలు వంచే సమయంలో అటుగా వెళ్లిన విద్యుత్ తీగల ద్వారా షాక్ తగిలింది. దీంతో శ్రీనివాస్ అక్కడ నుంచి కిందికి పడిపోవడంతో కాళ్లు, చేతులకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అమలాపురం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు.

గణన పద్ధతులపై అంతర్జాతీయ సెమినార్

దివాన్‌చెరువు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గణన శక్తితో గణితం కలయిక మనం సమస్యలను సంప్రదించే విధానాన్ని మార్చివేసిందని నన్నయ వర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం గణిత విభాగం ఆధ్వర్యంలో గణన పద్ధతులపై ఆన్లైన్ అంతర్జాతీయ సెమినార్ గురువారం జరిగింది. గణితంలో కంప్యూటేషనల్ టెక్నిక్‌ల ఇతివృత్తంగా జరిగిన ఈ సెమినార్‌లో వీసీ మాట్లాడుతూ భౌతికశాస్త్రం, ఇంజనీరింగ్‌లో సంక్లిష్ట వ్యవస్థల మోడలింగ్ నుంచి గణిత పద్ధతులను ఉపయోగించి కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యాసం, క్రిప్టోగ్రఫీలో పెద్దఎత్తున డేటాను నిర్వహించడం వరకూ ఒక అనివార్య సాధనంగా మారిందని చెప్పారు. ఈ సందర్భంగా బంగ్లాదేశ్ యూనివర్సిటీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్ రెహనా నస్రీన్, వరంగల్ ఎన్ఐటీ నుంచి ప్రొఫెసర్ డి.శ్రీనివాసాచార్య హాజరై గణతంలో గణన పద్ధతులపై క్షుణ్ణంగా ప్రజంటేషన్ ఇచ్చారు. రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి ప్రిన్సిపాల్, పి.విజయనిర్మల, కన్వీనర్ టి.హైమావతి, కోకన్వీనర్లు కె.రేవతి, కేవీఎం వరకుమార్, శ్రీనివారావు, మల్లిప్రియ, అశోక్, గీత, సుజాత పాల్గొన్నారు.

గోవులను వధించి నూనె తయారీ

- తునిలో పోలీసుల దాడులు
- నలుగురి అరెస్ట్
- గో మాంసం, ఆయిల్ స్వాధీనం


తునిలో గో మాంసం నుంచి తీసిన కొవ్వు పదార్థాలు, గో మాంసం నిల్వలు

తుని రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో దారుణం వెలుగుచూసింది. పవిత్రమైన గోవులను వధించే ముఠా గుట్టురట్టు అయింది. తుని కేంద్రంగా కొన్నేళ్లుగా సాగుతున్న ఈ వ్యవహారంపై పోలీసులు దృష్టి సారించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తుని సీఐ గీతా రామకృష్ణ బృందం పట్టణ శివారు రామకృష్ణా కాలనీలో గురువారం ఆకస్మిక దాడులు చేశారు. అదే ప్రాంతంలో తాండవ నదీ తీరాన ఆనుకుని ఒక ఇంట్లో గోవులను దాచిపెట్టి వధించి ఆయిల్ తయారు చేస్తున్నట్టు గుర్తించారు. గో మాంసంతో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ గీతారామకృష్ణ మాట్లాడుతూ ఇదే ప్రాంతంలో 2023లో గో మాంసం ఆయిల్ తయారీపై దాడి చేయగా ఇదే రీతిన గో మాంసం, ఆయిల్ పట్టుబడిందని కేసు నమోదు చేశామన్నారు. అదే వ్యక్తులు ఇప్పుడు ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్నట్టు తెలిసిందన్నారు. స్థానిక వీఆర్వో, వెటర్నరీ డిపార్టుమెంట్‌తో కలిసి దాడులు చేశామని.. 8 టిన్నుల్లో గో మాంసం నుంచి తీసిన నూనెలు, గో మాంసం సీఐ పట్టుపడిందని తెలిపారు. మహ్మద్ సంసరే, మహ్మద్ హరీఫ్, మహ్మర్ ఇరీస్, బానేపల్లి మహేష్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ

అర్ధరాత్రి తలుపులు పగలగొట్టి.. వృద్ధురాలిని కొట్టి..

15 కాసుల బంగారం, రూ.50వేల నగదు దోచుకున్న నలుగురు దుండగులు

రెండు మోటార్‌సైకిళ్లను సైతం దొంగిలించి వాటిపై పరారీ

తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో ఘటన


బీరువాలోని దుస్తులను చెల్లాచెదురుగా పడేసిన దొంగలు


గాయపడిన వృద్ధురాలు

నల్లజర్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఓ ఇంటి తలుపులు పగల గొట్టి ప్రవేశించి నిద్రిస్తున్న ఒంటరి వృద్ధురాలిపై దాడి చేసి మెడలో ఉన్న బంగారు గొలుసు, చెవిదిద్దు లు, బీరువాలో ఉన్న 4 గాజులు మొ త్తం 15 కాసుల బంగారుం, రూ.50 వేల నగదు దోచుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. నల్లజర్ల సెంటర్‌లో వృద్ధురాలు పాకలపాటి సుభద్ర ఒంటరిగా నివాసం ఉంటుంది. కుమారుడు రమేష్ తల్లికి పగలు సేవలందించి రాత్రి అదే గ్రామంలోని అత్తగారింటికి వెళ్లి నిద్రిస్తాడు. ఇది గమనించిన దుండగులు బుధవారం అర్ధరాత్రి 1.30 గంటలకు నలుగురి ముసుగులు ధరించి ముందుగా ఇంటి తలుపుకొట్టారు. తీయకపోవడంతో పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు, చెవిదిద్దులు తీసుకుని బీరువా తాళాలు ఎక్కడున్నాయని ఆమెపై రాళ్లతో దాడి చేశారు. ఆమె గాయాలు భరించలేక బీరువా తాళాలు ఇచ్చేసింది. బీరువాలో ఉన్న 4బంగారు గాజులు, రూ.50 వేల నగదు దోచుకున్నారు. భయంతో వృద్ధు రాలు బిగ్గరగా కేకలు వేయడంతో దొంగలు ఆమె సెల్‌ఫోన్ తీసుకుని గోడ దూకి పక్కింట్లోని రెండు మోటార్‌సైకిళ్లను సైతం దోచుకుని వాటిపై పారిపోయారు. తర్వాత తేరుకున్న సుభద్ర సెంటర్‌కు పరిగెత్తుకుంటూ వెళ్లి మరొకరి సెల్ ఫోన్ తీసుకుని కుమారుడు రమేష్‌కు ఫోన్ చేయడంతో అతడు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటన జరిగిన ప్రదేశానికి వచ్చి కొవ్వూరు డీఎస్పీ దేవ కుమార్, దేవరపల్లి సీఐ నాయక్ పరిశీలించారు. రాజమహేంద్రవరం నుంచి క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరిం చారు. కేసు నమోదు చేశామని, నిందితులను త్వరలో పట్టుకుం టామని డీఎస్పీ దేవకుమార్ తెలిపారు. సుభద్ర ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలో దుండగులు వచ్చిన దృశ్యాలు కనిపిస్తున్నాయని, వారి కోసం నాలుగు బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నట్టు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక


రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాల, బాలికల జట్లు

పిఠాపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్ల ఎంపిక ప్రక్రియను కాకినాడ జిల్లా పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే అండర్-19పోటీలకు అర్హులైన క్రీడాకారుల ఎంపికకు గానూ పోటీలు జరిగాయి. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా ఉమ్మడి జిల్లా బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు ఇందులో పాల్గొన్నారు. ఎంపిక ప్రక్రియను ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు, ఉమ్మడి జిల్లా రగ్బీ అసోసియేషన్ ఛైర్మన్ వియ్యపు రామన్నరాజు ప్రారంభించగా, ఫిజికల్ డైరెక్టర్ రత్నశామ్యూల్, టెక్నికల్ అఫిషియల్ పి.పద్మ, గోవింద్, పి.లక్ష్మణరావు, బి.కృష్ణార్జున, వంశీ ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయి. కార్యక్రమంలో డి.రామకృష్ణ, కె.చిన్నబ్బాయి, పల్లా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన జట్లు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్ 19 బాలుర జట్టు సభ్యులుగా జశ్వంత్, జె.ప్రణీత్‌కుమార్, ఎం.నానిబాబు, బి.సుశాంత్, వి.హేమంత్, ఎం.రిషేంద్రవర్మ, బి.సోమరాజు, పి.నాని, కె.ప్రతీష్, ఎం.అనిల్‌కుమార్, కె.అచ్యుత్, డి.అఖిల్, డి.బంగారం, ఆర్.లోకేష్, దుర్గాసాయితేజ, వి.రాము ఎంపికయ్యారు. బాలికల జట్టు సభ్యులుగా పి.సంధ్య తేజశ్రీ, ఎం.కల్యాణి, జి.తేజస్విని, పి.దివ్య, పి.మహాలక్ష్మీ, పి.భవానీ, పీవీఎల్‌జీ భవానీ, కె.జాహ్నవిశ్రీ, భవ్యశ్రీ, సీహెచ్.అపర్ణ, ఎం.నవ్య, ఆర్.స్వర్ణప్రియ, డి.దుర్గాఅలేఖ్య, కె.హరిణి, ఎస్.శ్రీసత్య, జె.ప్రియాంక ఎంపికయ్యారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పుల్లేటికుర్రు విద్యార్థులు


పోటీలకు ఎంపికైన పుల్లేటికుర్రు విద్యార్థులు

అంబాజీపేట, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఇటీవల కాకినాడలో జరిగిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ కనబరిచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం ఎ.వెంకట్రావు, పీడీ అండె సూర్యనారాయణ తెలిపారు. బాల్‌బాడ్మింటన్, ఖోఖో, అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. సీహెచ్.జ్యోతిసాయి పల్లవి, ఎ.రక్షిత బాల్‌బాడ్మింటన్, వాలీబాల్‌కు... జి.రమాఅషిత 1500 మీటర్ల పరుగుపోటీల్లో, సీహెచ్ హర్షవర్ధని, 3కేఎం, 4కేఎం పరుగు పోటీల్లో ఎం.తేజస్విని, దుర్గాశ్రీ ప్రథమస్థానం, మర్రి తేజస్వ 3కేఎంలో ప్రథమ స్థానం సాధించారు. కొప్పిశెట్టి మనోజ్ జూనియర్ అథ్లెటిక్స్ వవిభాగంలో ప్రతిభ కనబరిచాడు. అలాగే మర్రి తేజస్వ, సీహెచ్ హర్షవర్ధని ఖోఖో పోటీలకు ఎంపికైనట్టు వారు తెలిపారు. క్రీడాకారులకు తర్ఫీదును అందించిన పీడీ అండె సూర్యనారాయణ, పీఈటీ దొమ్మేటి ఉదయభాస్కర్‌ను సత్కరించారు.

శాస్త్రవేత్తల జాబితాలో జేఎన్టీయూకే ప్రొఫెసర్లు


ప్రొఫెసర్ ఆర్.శ్రీనివాసరావు


ప్రొఫెసర్ బీటీ.కృష్ణ

జేఎన్టీయూకే, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీ, ప్రచురణ సంస్థ ఎల్సీ వీర్ ఆధ్వర్యంలో జరిగిన సర్వేలో 2025 సంవ త్సరానికి గాను ప్రపంచ రెం డు శాతం శాస్త్రవేత్తల జాబితాలో జేఎన్టీయూకే ప్రొఫెసర్ల స్థానాలు పొందారు. ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ విభాగంలో ఎనర్జీ ఏఐ ఇమేజ్ ప్రాసెసింగ్ సబ్ కేటగిరీలో వారికి చోటు దక్కిందని ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. ఈఈఈ విభాగం ప్రొఫెసర్, రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావుకు 6,975వ స్థానం... ఈసీఈ విభాగం ప్రొఫెసర్ బీటీ.కృష్ణకు 8,584వ స్థానం లభించిందన్నారు. ఈ విధంగా చోటుదక్కడం జేఎన్టీయూకే చరిత్రలో ఇదే మొదటిసారి అన్నారు. ఇద్దరు ప్రొఫెసర్లు 100కు పైగా జర్నల్స్‌లో పేపర్లు ప్రచురించారన్నారు. వారిని వీసీ ప్రసాద్, డైరెక్టర్లు, అధ్యాపకులు అభినందించారు.

దేవీచౌక్‌లో ప్రత్యేక పూజలు


దేవీచౌక్‌లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డివాసు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో శ్రీబాలాత్రిపుర సుందరి దేవి నాల్గోరోజు గురువారం శ్రీకాత్యాయిని దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ప్రత్యేక పూజలు చేసి పట్టువస్త్రాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ద్రాక్షారామలో...

ద్రాక్షారామ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయంలో మాణిక్యాంబ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

జల ప్రహార్.. సైనికా జోహార్!

కాకినాడ తీరంలో ముగిసిన యుద్ధ విన్యాసాలు


కాకినాడ తీరంలో యుద్ధ విన్యాసాల దృశ్యాలు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 25 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ డీప్ సముద్రంలో భారత నౌకా దళం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి ఉభయ చర వ్యాయామం (జల ప్రహార్-25) యుద్ధ విన్యాసాలు విజయవంతంగా ముగిసినట్టు అధి కారులు తెలిపారు. ఉమ్మడి సైనిక విన్యాసం, యుద్ధ సన్నదతను మరింత మెరుగుపరచడానికి ఈ విన్యాసాలను ఏటా భారత త్రివిధ దళాల ఆధ్వర్యంలో కాకినాడ సముద్ర తీరంలో నిర్వహిస్తున్నాయి. ద్వైవార్షిక ఉమ్మడి వ్యాయామం జల ప్రహార్‌ను భారత దేశ తూర్పు సముద్ర తీరంలో ఉభయచర కార్యకలాపాల్లో సెంటర్-సరీస్ సినర్జీ, కార్యాచరణ ప్రణాళిక అమలును ధృవీకరించడం, త్రివిధ దళాల సన్నద్ధతను మరింత మెరుగుపరచడం లక్ష్యంగా చేసుకుని సెప్టెంబరు 21-23 వరకు కాకినాడ సముద్ర మధ్యభాగంలో విన్యాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎన్ఎస్ ఘరియల్‌లోకి సైన్య దళాలను ప్రవేశ పెట్టడం, ఏకీకృతం చేయడం చేశారు. ఈ విన్యా సాల్లో భాగంగా ఆన్‌బోర్డు శిక్షణ, భద్రతా బ్రీఫిం గ్‌లు, నావికుడి జీవితం వైపు దృష్టి సారించడం, క్రీడలు, స్నేహాన్ని పెంపొందించేందుకు ఈ ఉమ్మడి పరస్పర విన్యాసాలు ఎంతగానో దోహద పడతాయని అధికారులు తెలిపారు. విన్యాసాల్లో భాగంగా సముద్రతీరంలో హార్డ్ బీచింగ్, ఎన్‌సీల, బీఎంపీలను ప్రారంభించి, ఎస్‌ఓపీలు, ఉమ్మడి శిక్షణ అంతా ఒక పద్ధతిలో విన్యాసాలు నిర్వహిం చినట్లు త్రివిధ దళాల అధికారులు తెలిపారు. ఈ వ్యాయామం రెండు దశల్లో నిర్వహించగా, మొద టి దశలో ఈనెల 16నుంచి 20 వరకు విశాఖప ట్నంలో హార్బర్‌దశలో చేయడం జరిగిందన్నారు.

విజయదుర్గా పీఠంలో కుంకుమ పూజలు

రాయవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గా పీఠంలో అమ్మవారు రజత కవచధారిగా పూజలందుకుంది. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ జరిపి కుంకుమ పూజలు జరిపారు. ఆధ్యాత్మికవేత్త బేతవోలు రామబ్రహ్మం రామాయణం విశిష్టత వివరించగా, గొర్తి సుబ్రహ్మణ్య శర్మ అమ్మవారి అవతారాలు, రాక్షస సంహారాన్ని భక్తులకు తెలియజేశారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయ దుర్గ సేవా సమితి ప్రతినిధులు జీఎస్‌వీ కామేశ్వరి, భాస్కరనారాయణ తదితరులున్నారు.



చీరమేను వచ్చేసింది...

యానాం మార్కెట్‌లో సందడి

యానాం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత ప్రాంతమైన యానాం మార్కెట్‌లోకి చీరమేను వచ్చేసింది. యానాం, గోదావరి జిల్లావాసులు ఎంతో ఇష్టంగా తినే చీరమేను శీతకాలం ప్రారంభంలోను, ఎక్కువగా దీపావళి ముందుగా దొరకుంది. ముఖ్యంగా తూర్పుగాలుల సమయంలో ఈ చీరమేను మత్స్యకారులకు దొరుకుతుంది. ఈ చేపలు చాలా చిన్నగా వేళ్ల సందులు, వలలోంచి జారిపోయేంత చిన్నగా ఉండడంతో గతంలో చీరలతో మాత్రమే పట్టేవారు. తర్వాత చిన్నచిన్న వలలతో వాటిని పట్టుకుంటున్నారు. ప్రస్తుతం తూర్పుగాలులు వీస్తుండటంతో గత 2 రోజులుగా యానాం మార్కెట్‌లోకి సూమరు ఐదు క్యారేజీల చీరమేను వచ్చింది. ప్రస్తుతం సేరు రూ.1500 నుంచి 2000 వరకు ధర పలికింది. వీటితో అనేక రకాల వంటలు చేసుకోవచ్చు. ఇకపై అడపదడపా దీపావళి వరకు చీరమేను దొరకనుంది.

కాత్యాయనీదేవిగా అమ్మవారి దర్శనం

● నాల్గోరోజు దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

● వివిధ అలంకరణలో అమ్మవార్లు



ముమ్మిడివరంలో..



అంబాజీపేటలో..





అప్పనపల్లిలో మహాలక్ష్మి అమ్మవారు, అల్లవరంలో...



అమలాపురం గోల్డ్ మార్కెట్ సెంటర్‌లో...

అమలాపురంటౌన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా నాల్గోరోజు గురువారం దుర్గమ్మ భక్తులకు పలు ఆలయాల్లో కాత్యాయనిదేవిగా దర్శనం ఇచ్చారు. అమలాపురం శ్రీదేవి మార్కెట్‌సెంటర్‌లో శ్రీదేవి అమ్మవారు భక్తులకు కాత్యాయని అలంకారంలో కొలువుదీరారు. అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని కల్యాణ దుర్గమ్మ వారాహీదేవిగా దర్శనమిచ్చారు. కాలనీకి చెందిన వడగన సుబ్బరాజు-శేషవేణి దంపతులు, కుమారులు నాగచంద్రం, శివలు అమ్మవారిని వారాహీదేవిగా విశేష అలంకారం చేయించారు. స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఉన్న శ్రీవైష్ణవి కనకదుర్గమ్మ భక్తులకు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. స్థానిక గోల్డ్ మార్కెట్ సెంటర్‌లోని కామాక్షీ ఏకాంబరేశ్వరిదేవిని గాజులతో విశేష అలంకారం చేయగా భక్తులకు కాత్యాయనిదేవిగా దర్శనం కల్పించారు. అనంతరం కాత్యాయనిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవైష్ణవి కనకదుర్గ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా, తాటికాయలవారిపాలెంలో శ్రీకనక దుర్గమ్మ శ్రీకాత్యాయనిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

భవానీమాలధారుల పూజలు

నల్లమిల్లి గ్రామంలో ఉన్న మురళీకృష్ణ స్వామి ఆలయం వద్ద శ్రీదుర్గా వీరభద్ర భవానీ పీఠం ఆధ్వర్యంలో జైభవాని సేవాసమితి అధ్యక్షుడు ఆర్లపల్లి ముత్యం, గంగాభవానీ నేతృత్వంలో విశేష పూజలు నిర్వహించారు. పూజల అనంతరం నిప్పులగుండం కార్యక్రమాన్ని మాలధారులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో సద్గురు గీతామందిరం మాతాజీలు, శ్రీదుర్గా వీరభద్ర పీఠం గురుభవానీలు, జైభవానీ సేవాసమితి సభ్యులు, సమరసన సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ మేడిశెట్టి నాగభూషణం, భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో విశేష పూజలు

మామిడికుదురు(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాల్గోరోజు గురువారం అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదపట్నంలంక అమ్మవారు గురువారం కూష్మాండ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అప్పనపల్లి బాలబాలాజీ స్వామి సన్నిధిలో శ్రీమహాలక్ష్మి అమ్మవారు సంతాన లక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. మగటపల్లిలోని గాయత్రీ త్రిశక్తి పీఠంలో లలితాదేవిగాను పాశర్లపూడిబాడవలో అన్నపూర్ణాదేవిగాను సాక్షాత్కరించారు.

ముమ్మిడివరం(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మెయిన్‌రోడ్డులోని ఈశ్వరమ్మ గుడిలో విజయదుర్గమ్మవారు గురువారం కాత్యాయినీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీవారు అమ్మవారిని కాత్యాయినీదేవిగా అలంకరించి విశేష పూజలు జరిపించారు. ముమ్మిడివరం రాణేలంక పంచాయతీ పరిధిలోని గోదాశివారిపాలెం శ్రీవిజయదుర్గమ్మవారి ఆలయంలో చిన్నారులు వివిధ నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయంలో ఈ ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించారు.

గాయత్రీదేవిగా మసేనమ్మ తల్లి

పి.గన్నవరం(ఆంధ్రజ్యోతి): గురువారం కాత్యాయని దేవిగా శ్రీకనకదుర్గమ్మ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. గంటిపెదపూడిలో మసేనమ్మకు ప్రత్యేకపూజలు నిర్వహించిన

ఘనంగా దుర్గాచండీ హోమాలు

అల్లవరం(ఆంధ్రజ్యోతి): అల్లవరం మండలంలోని కనకదుర్గ ఆలయాలువద్ద హోమాలు, కుంకుమ పూజలతో హోరెత్తాయి. అల్లవరం విజయకనకదుర్గ ఆలయంవద్ద వేద పండితులు మంగళంపల్లి పాండురంగవిఠల్ బ్రహ్మత్వాన బీజేపీ నాయకులు సుంకర సత్యసాయిబాబా, రాము సోదరులు కర్తలుగా గురువారం దుర్గా చండీ హోమం ఘనంగా జరిగింది. అల్లవరంలో కంకిపాటి గోపి, మధు, కొమరగిరిపట్నంలో నడింపల్లి వేణురాజు ఆర్థిక సహాయంతో అన్నసమారాధనలు జరిగాయి. కొమరగిరిపట్నం, యెంట్రుకోన, కోడూరుపాడు, బోడసకుర్రు, బెండమూర్లంక, గోడిలంక, గోడితిప్ప, దేవగుప్తం, డి.రావులపాలెం పరిసర గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల వద్ద అభిషేకాలు, నిత్య కుంకుమ పూజలు జరిగాయి.

అంబాజీపేట(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అంబాజీపేట బస్‌స్టాండ్‌వద్ద ఉన్న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారిని గురువారం కాత్యాయనిదేవిగా అలంకరించారు. అంబాజీపేట సంతమార్కెట్‌లో శ్రీ విజయకనకదుర్గమ్మ అమ్మవారికి అంబాజీపేట విజయబేతాళస్వామి, పక్షులరావిచెట్టు వద్ద అమ్మవారి ఆలయంలోపూజలను చేశారు.

కాత్యాయనిగా మావుళ్ళమ్మతల్లి

కాట్రేనికోన(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రుల్లో భాగంగా గురువారం కాట్రేనికోన గ్రామదేవత మావుళ్ళమ్మ కాత్యాయని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. చెయ్యేరు దాసులమ్మతల్లి ఆలయంలో నంద్యాల పెద్దకాపు దంపతులు, పలువురు మహిళలు కనకదుర్గను కాత్యాయనీదేవిగా అలంకరించి పూజించారు.

యానాం(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గపరిధిలోని వివిధ ఆలయాల్లో దేవీనవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. నాల్గవరోజు గురువారం యానాం శివారు గిరియాంపేటరోడ్డులోని శ్రీపాల కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ఆలయఅర్చకులు రాయప్రోలు కామేశ్వరశర్మ ఆధ్వరంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలకరించి విశేషపూజలు నిర్వహించారు. సాయంత్రం ద్వారాపూడికి చెందిన దొంతికుర్తి విజయశర్మచే ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. పడవలరేవు వీధిలోని లలితాదేవి ఆలయంలో అమ్మవారు లలితాదేవిగాను, గోపాల్‌నగర్‌లోని శారదాదేవి (సరస్వతి)ఆలయంలో అమ్మవారు రాజమాతాంగిగా అలంకరణలో, శివాలయ ప్రాంగణంలోని శ్రీవాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవారు లలితాదేవి అమ్మవారిగా దర్శనమిచ్చారు.

యానాం వెంకన్నకు విశేష పూజలు

యానాం శ్రీభూసమేత వెంకటేశ్వరస్వామి బాలలయంలో త్రివింశతీ(23వ)బ్రహ్మోత్సవాల లో భాగంగా గురువారం ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అదికారులు, పలువురు దాతల సహకారంతో పదిరోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. శనివారం ఉదయం శ్రీవారి బ్రహ్మోత్సవ హంస వాహన కాపు ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో సువర్ణపుష్పార్చన, ముత్యాలహారతి, సహస్రనామార్చన వివేశపూజలు నిర్వహించారు.

వైద్య శిబిరాలు వినియోగించుకోవాలి

● సీహెచ్‌సీ సూపరింటెండెంట్ రాఘవేంద్రరావు

పి.గన్నవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు నిర్వహించే వైద్య శిబిరాలు వినియోగించుకోవాలని సిహెచ్‌సీ సూపరిడెంట్ యు.రాఘవేంద్రరావు కోరారు. లంకలగన్నవరంలో గురువారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మహిళలకు వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. గర్భిణులకు వైద్య పరీక్షలు అనంతరం సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, గ్రామ సర్పంచ్ గనిశెట్టి గంగాభవాని, ఎంపీటీసీ అవనిగడ్డ సత్యనారాయణ, చిట్టాల జోగేశ్వరావు, గనిశెట్టి ఈశ్వర్, యర్రంశెట్టి వెంకటరమణ, వేమన రామకృష్ణ, అంగన్వాడీలు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలి

అమలాపురం రూరల్(ఆంధ్రజ్యోతి): బండారులంక గ్రామంలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాన్ని సర్పంచ్ పెనుమాల సునీత ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ మహిళలు పౌష్టికాహారాన్ని తీసుకుంటేనే ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చునని చెప్పారు. మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి, కొండా రాజు, కాశిన బాబి, చింతపట్ల మోహన్, మల్లవరపు ఏడుకొండలు, వాసా భీమశకరం, గ్రామ కార్యదర్శి కోరుమిల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. .

మామిడికుదురు(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మహిళల కోసం నిర్వహిస్తున్న స్వస్థ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు కోరారు. మగటపల్లిలో గురువారం జరిగిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పెదపట్నంలంకలో జరిగిన శిబిరాన్ని ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో పీహెచ్‌సీ వైద్యులు జాన్‌లెవీ, సత్యవతి, సర్పంచ్ సూరిశెట్టి లక్ష్మి, హెచ్‌పీసీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంగా ఉండాలి

అయినవిల్లి(ఆంధ్రజ్యోతి): స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అయినవిల్లిలంక గ్రామంలో గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సర్పంచ్ కుమ్మరి నాగవాణిమాధవీలలిత రమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మండల టీడీపీ అధ్యక్షుడు వస్కా శ్యామ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు మంగాదేవి, హెల్త్ సూపర్‌వైజర్ సుధాకర్, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి అంజిబాబు, ఎంపీటీసీ దాసరి శైలజ వీరాస్వామి, కోడూరి రఘు, మధుర రమేష్, కుమ్మరి వెంకటరమణ, స్కూలు కమిటీ చైర్మన్ కొల్లాటి శ్రీనివాస్, ఎస్సీసెల్ కార్యదర్శి నక్కా వేణు, అడ్డాల లక్ష్మీబంగారం, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అంబాజీపేట(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారిలు అన్నారు. మాచవరం సచివాలయంవద్ద సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అధ్యక్షతన జరిగిన వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలుచేసి మందులను అందించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. వైద్యాధికారులు కేఎన్ శ్రీనివాస్, సీహెచ్‌వో బి.అప్పారావు, ఆయుష్ వైద్యుడు శ్యామ్‌సుందర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీఎస్వీ మహాలక్ష్మి, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.



లంకలగన్నవరంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

రాజోలు(ఆంధ్రజ్యోతి): ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణరావు అన్నారు. చింతలపల్లిలో పీఎం నరేంద్రమోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సేవా పక్షోత్సవంలో భాగంగా స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం సర్పంచ్ మట్టా ప్రసన్న కుమారి అధ్యక్షతన గురువారం జరిగింది. వైస్ ఎంపీపీ యింటిపల్లి ఆనందరాజు, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు యింటిపల్లి రామకృష్ణ, వైద్యాధికారి ఫణికుమార్, హెల్త్ సూపర్‌వైజర్ కె.త్రినాథరావు, సెక్రటరీ కె.రజనీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, యానిమేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పన్నులను సకాలంలో వసూలు చేయండి

● డీఎల్‌డీవో రాజేశ్వరరావు

పి.గన్నవరం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామపంచాయతీలో ఇంటి పన్నులను సకాలంలో వసూళ్లు పూర్తిచేసి పంచాయతీల అభివృద్ధికి కృషిచేయాలని డీఎల్‌డీవో ఎస్.వెంకట రాజేశ్వరావు సూచించారు. పి.గన్నవరం మండల పరిషత్ సమావేశపు మందిరంలో గురు వారం కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లకు ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటిపన్నుల విషయంలో అలసత్వం వహించరాదని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్ధేశించిన సర్వేలను సకాలంలో పూర్తిచేసి సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. గ్రామాలలో ప్రతిరోజు శానిటేషన్‌ను విధిగా నిర్వహించాలని, అదే సమయంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛత హి సేవా-2025 కార్యక్రమంలో భాగంగా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ..స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటాలని పిలుపుని చ్చారు. అనంతరం గ్రామా లు వారీగా సర్వేలపై ప్రగతి, ఇంటి పన్నుల వసూళ్లు, శానిటేషన్ తదితర అంశాలపై రివ్యూ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈసమావేశంలో ఎంపీడీవో జి.మల్లిఖార్జునరావు, డిప్యూటీ ఎంపీడీవో జి.ఉమామహేశ్వరావు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీవో రాజేశ్వరావు

అంబేడ్కర్ కాలనీలో శ్రమదానం

స్వచ్ఛతహి సేవా-2025 కార్యక్రమంలో భాగంగా పి.గన్నవరం శివారు అంబేడ్కర్ కాలనీలో గురువారం స్థానిక ప్రజా ప్రతినిధులు, పంచాయతీ అధికారులు, సిబ్బంది, సచివాలయం ఉద్యోగులు ఉపాధిహామీ కూలీలు శ్రమదానం నిర్వహిం చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొండాడ నాగమణి, ఎంపీటీసీ పులపర్తి చినవెంకటలక్ష్మి, పంచాయితీ కార్యదర్శి నిమ్మకాయల వెంకట సత్యనారాయణ, ఈశ్వర్, అంగన్వాడి, సచివాయం ఉద్యోగులు, కూలీలు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రను విజయవంతం చేయాలి

ముమ్మిడివరం(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పర సమన్వయంతో కృషిచేయాలని కమిషనర్ పి.రవివర్మ సూచించారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా నగర పంచాయతీ కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులకు ముమ్మిడివరం డీఎల్‌ఎఫ్ ఫంక్షన్ హాలులో గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ పి.రవివర్మ మాట్లాడుతూ ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ, ద్రవ వ్యర్థ పదార్థాల నిర్వహణ, డంపింగ్ యార్డు నిర్వహణ విషయాలపై అవగాహన కల్పించారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర, వాష్ ఇనిస్టిట్యూట్, సహాస్ సంస్థల కోఆర్డినేటర్ పి.రాము, జిల్లా కెపాసిటీ కోఆర్డినేటర్, రిసోర్సు పర్సన్ బీవీ రావు, తిరుమలకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు



ధ్రువీకరణ పత్రాలు అందుకున్న విద్యార్థులు

మలికిపురం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): తాము చదువుకున్న ఎలక్ట్రానిక్స్‌తో ముడిపెట్టి నలుగురు మలికిపురం ఎంపీఎన్‌జేఎస్ అండ్‌ఆర్వీఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు పరిశోధనాత్మక పత్రాలను అందించి వారు గుర్తింపు పొందారు. డిగ్రీ కళాశాలకు ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ వైవీఎస్ కృష్ణమూర్తి-ఉష దంపతులు వచ్చి రిమోట్ సెన్సింగ్ సాంకేతికతపై ప్రసంగించారు. ఆ సదస్సుకు నలుగురు విద్యార్థులు హాజరుకాలేకపోయారు. కానీ వారికి శాస్త్రవేత్త ప్రసంగించిన విషయాలపై ఆతృతతో యూ ట్యూబ్‌లో విని ప్రేరణ పొందారు. వినూత్నంగా ఆలోచించారు. రిమోట్ సెన్సింగ్ విధానంపై పరిశోధన చేయాలనుకున్నారు. దీంతో తాము రూపొందించబోయే పరిశోధనా పత్రానికి ది ఇండ్‌స్పెన్సబుల్ రోల్ ఆఫ్ మోడర్న్ ఎలక్ట్రానిక్స్ ఇన్ అడ్వాన్సింగ్ రిమోట్ సెన్సింగ్ ఫర్ కాంటెంపరరీ సొసైటీ అని నామకరణం చేశారు. అధ్యాపకుడు డాక్టర్ విజయ్‌సత్యప్రసాద్ పర్యవేక్షణలో వి.దుర్గాసౌమ్య, ఎం.లక్ష్మి, తాడి విజయదుర్గ, కంచి లిఖితశ్రీ రూపొందించిన ఈ పరిశోధనా పత్రం అంతర్జాతీయ జర్నల్‌లో చోటు సంపాదించి ధ్రువీకరణ పత్రాలు పొంది ఘనత సాధించారు. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వీరికి కరస్పాండెంట్ ఎంవీ సత్యనారాయణమూర్తి అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆనందమహానీ, చిట్టాల సత్యనారాయణ, పి.సూర్యనారాయణరాజు, పీడీకే ప్రసాద్, ఆర్.మనసే పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆధారాలు జతచేయాలి

కాట్రేనికోన, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మీసేవా కేంద్రాల్లో కులం, ఆదాయం తదితర సర్టిఫికెట్లకు దరఖాస్తులు ఆన్‌లైన చేసేటప్పుడు సంబంధిత ఆధారాలతో డాక్యుమెంట్స్ విధిగా స్కాన్ చేసి, నకళ్లతో సహా దరఖాస్తులు వీఆర్వోలకు లేదా తహసీల్దార్ కార్యాలయంలో సమర్పిస్తే సకాలంలో సర్టిఫికెట్లు జారీ అవుతాయని తహసీల్దార్ సుబ్బలక్ష్మి అన్నారు. గురువారం ఆమె మీసేవ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ముటేషన్ల దరఖాస్తులకు వీఆర్వోలను సంప్రదించాలని అన్నారు. జనన, మరణ ధ్రువపత్రాలకు నోటరీ జతచేయాలన్నారు. ప్రస్తుతం ల్యాండ్ కన్వర్షన్ దరఖాస్తులు పెట్టవద్దన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రవికిరణ్, ఆర్‌ఐ విశ్వనాధ్ పాల్గొన్నారు.

ఆలయంలో మార్క్‌ఫెడ్ చైర్మన్ పూజలు



స్వామివారి ఆలయంలో మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజుకు ఆశీర్వచనం అందిస్తున్న అర్చకులు

అంతర్వేది, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): నవనారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు గురువారం విచ్చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో స్వామిని దర్శించుకున్న ఆయనకు వేద పండితులు మహాదాశీర్వచనం అందించారు. అనంతరం ఆలయ అధికారులు బంగార్రాజుకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, ముప్పర్తి నాని, ఎంపీటీసీ బైరా నాగరాజు, పోతురాజు కృష్ణ, పొన్నాల విజయ్, పిండి సత్యనారాయణ, దాసరి వాసు, సూపరింటెండెంట్ పి.విజయసారథి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా స్వాతి నక్షత్ర పూజలు

అంతర్వేది, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామివారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్ర పూజలను గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత అర్చకులు స్వామివారి బంగారు కలశను శిరస్సుపై పెట్టుకుని ప్రదక్షిణలు చేశారు. అనంతరం 108 కలశాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి అష్టోత్తర జన్మ నక్షత్ర పూజలు అర్చకుల వేద మంత్రోచ్చారణల నడుమ జరిగాయి.

గౌరవ వేతనం రాలేదని ఎంపీటీసీల ఆందోళన



నిరసన తెలుపుతున్న ఎంపీటీసీ సభ్యులు

అల్లవరం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎంపీటీసీలకు సరైన గౌరవం, గౌరవ వేతనం అందడం లేదని ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో సుమారు 430 మంది ఎంపీటీసీలు ఉండగా వీరిలో 23 మంది మండల ప్రజాపరిషత్ అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. గడచిన 30 నెలలుగా ఎంపీటీసీలకు గౌరవ వేతనం రావడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. నెలకు రూ.3వేలు ఎంపీటీసీలకు గౌరవ వేతనాన్ని గత ప్రభుత్వం ప్రకటించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీలకు గౌరవ వేతనం వస్తుందనే ఆశతో వారు ఎదురుచూస్తున్నారు. ఎంపీటీసీలకు ప్రభుత్వం ద్వారా గౌరవ వేతనం అందేలా చర్యలు తీసుకోవాలంటూ గతంలో ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఎంపీటీసీలకు గౌరవ వేతనం చెల్లించకుంటే ఇక నుంచి మండల సమావేశాలు బహిష్కరిస్తామంటూ బాహటంగానే వారు విమర్శిస్తున్నారు. గడచిని 30 నెలలుగా ఎంపీటీసీలకు రావాల్సిన గౌరవ వేతన బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ఎంపీటీసీలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సొసైటీ రహదారికి తాత్కాలిక రోడ్డు నిర్మాణం

యానాం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గపరిధిలోని ఫరంపేట ఎస్సీ ఫీల్డ్ లేబర్ కోపరేటివ్ సొసైటీకి వెళ్లే రహదారి గత కొన్ని సంవత్సరాలుగా వరదలకు పాడైపోవడంతో ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో రైతులు సమస్యను రాజకీయ నాయకుడు తొటరాజును ఆశ్రయించారు. దీంతో వెనువెంటనే రోడ్డు నిర్మాణంచేసి రైతులకు అండగా నిలిచారు. తక్షణం స్పం దించి తమ సొసైటీకి రోడ్డు నిర్మాణం చేపట్టడం పట్ల రైతులు, స్థానికులు తోటరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. తోటరాజును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్సీ ఫిల్డ్ లేబర్ కోపరేటివ్ సొసైటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలకు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సపక్‌తక్రా పోటీల్లో కాంస్య పతకం



క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్పీ ప్రసాద్

అమలాపురంటౌన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా ఉరవకొండలో ఇటీవల జరిగిన 28వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సపక్‌తక్రా పోటీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా జట్టు రాష్ట్రస్థాయిలో కాంస్య పతకం సాధించింది. అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో గురువారం క్రీడాకారుల అభినందన కార్యక్రమం అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు జవ్వాది తాతబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ కొనియాడారు. రాష్ట్ర స్థాయిలో కూడా పతకాలు సాధించేలా శిక్షణ పొందాలని సూచించారు. విజేతలైన శశిధర్‌నాగ్, జి.సందీప్, బి.సూర్య, బి.చంటి, ఎ.యశ్వంత్‌లతో పాటు కోచ్ యాండ్ర గౌతమ్, కేతా సతీష్‌లను వాకర్ సభ్యులు కూచిమంచి కృష్ణ, తోట రాము, శ్రీధర్ వర్మ, గోవ్వాల రాజేష్, నాగిరెడ్డి శివప్రసాద్, జిల్లా అసోసియేషన్ కోశాధికారి సైదుల రమణ, ఎస్పీఎఫ్‌హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాలరావు, జిల్లా అసోసియేషన్ క్రీడా విజేతలను ప్రత్యేకంగా అభినందించారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి



దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజోలు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బీజేపీ జిల్లాశాఖ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం రాజోలులో ఘనంగా నిర్వహించారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్‌కుమార్‌తోపాటు పలువురు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా నాయకులు మాలే శ్రీనివాసనగేష్, సలాది వీరబాబు, కొపనాతి దత్తాత్రేయ, గంధి నానాజీ, అయ్యల బాషా, కుడుపూడి సత్యవతి, రమావర్మ, శివాజీ పాల్గొన్నారు.

మామిడికుదురు(ఆంధ్రజ్యోతి): జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ 109వ జయంతిని మామిడికుదురు, పెదపట్నంలంకలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, బైరిశెట్టి దుర్గారామకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు అప్పన వీరబాబు, మెండా ఆదినారాయణ, పెదమల్లు నానాజీ, కడలి నూకరాజు, పెదపట్నంలంకలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రాజోలు టీడీపీ ఇన్‌చార్జిని కలిసిన టీడీపీ నాయకులు



అమూల్యను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

మామిడికుదురు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జిగా నియమితులైన గొల్లపల్లి అమూల్యను మామిడికుదురు మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు గురువారం కలిసి అభినందించారు. ఆమెను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఐకమత్యంగా కలిసికట్టుగా పనిచేసి నియోజకవర్గంలో తెలుగుదేశంపార్టీ పటిష్టానికి కృషి చేద్దామని ఈ సందర్భంగా తెలిపారు. సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, సొసైటీ చైర్మన్ ఈలి శ్రీనివాస్, నయినాల అబ్బాస్, సాపే ఏకాదశి, కంచి విశ్వనాథం, పెచ్చెట్టి భాస్కరరావు, అప్పన రామకృష్ణ, కంచి వెంకటరమణ, గోకవరపు శ్రీను పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో కార్యకర్తలను గుర్తించాలి



శ్రీనివాస్‌కు సమస్యను వివరిస్తున్న జాలెం సుబ్బారావు

మామిడికుదురు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషిచేసిన నాయకులను గుర్తించి వారికి సముచిత స్థానం కల్పించాలని కోరుతూ నగరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు జాలెం సుబ్బారావు, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌కు విన్నవించారు. దీనికి రాష్ట్ర అధ్యక్షుడు సానుకూలంగా స్పందించారని, భవిష్యత్తు అంశాలపై చర్చించినట్టు తెలిపారు. ప్రభుత్వ పథకాలపై ప్రజల స్పందన, సూపర్-6 అమలుతీరు తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారన్నారు. జాలెంతోపాటు యువ నాయకుడు కోళ్ల సురేష్ ఉన్నారు.

బీఎస్పీ కార్యవర్గం

మలికిపురం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గ బీఎస్పీ అధ్యక్షుడిగా నల్లి ప్రసాదరావును విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు బండెల గౌతమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గెడ్డం సంపదరావులు ఎంపిక చేశారు. ఇన్‌చార్జిలుగా ఆకుమర్తి భూషణం, గంటా బాలాజీ, ఉపాధ్యక్షుడిగా మోకా శ్రీనుబాబు, ప్రధాన కార్యదర్శిగా నల్లి సునీల్, కార్యదర్శిగా పట్నాల సత్యనారాయణ, కోశాధికారిగా వెంకట్‌ను నియమించారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

కాత్యాయనీ నమోస్తుతే..

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నాలగవరోజు గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉచ్చిలి కాలువ రేవులో ఉన్న శ్రీ విజయదుర్గమ్మ అమ్మవారు కాత్యాయనిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రుల్లో భాగంగా సంధిపూడిలో దుర్గాభవానీల అధ్వర్యంలో కలశ పూజను నిర్వహించారు. పలువురు దంపతులు ఏర్పాటు చేసిన భవానీ కలశపూజను ముక్కామల కామేశ్వర శర్మగురుస్వామి, దున్నె రాంబాబు భవానీల పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా జరిపారు. ముందుగా గ్రామంలో కలశాలతో ఊరేగింపు నిర్వహించగా, అధిక సంఖ్యలో భవానీ భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

అమ్మవారికి కుంకుమ పూజలు

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగర, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, వల్లూరు, కాలేరు తదితర గ్రామాల్లో దేవీనవరాత్రులను పురస్కరించుకుని 4వ రోజు గురువారం కాత్యాయనీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఆయా ఆలయాలు, మండపాల్లో అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు.

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని ఆయా అమ్మవారి ఆలయాల్లో సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. ఈతకోట కనకదుర్గమ్మ ఆలయంలో నిర్వహించిన సామూహిక కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. రావులపాలెం కాలువగట్టు చెంతన ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. అమ్మవారి ఆలయాలు, ప్రత్యేక మండపాల వద్ద నిర్వహించిన పూజల్లో భవానీ మాలధారులు పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి విరాళం

ఆత్రేయపురం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురు వారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. ఈ సందర్భంగా స్వామివారి నిత్యాన్నదాన ట్రస్టుకు ముమ్మిడివరం బాలాజీ కాన్వెంట్‌కు చెందిన పరశరాముని వెంకట సీతారామశాస్త్రి, సుజాత దంపతులు రూ. 1,00,116 విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆలమూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చొప్పెల్ల సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రాజమచంద్రపురం డీఈ కె.రత్నాలరావు తెలిపారు. చొప్పెల్ల సబ్‌స్టేషన్ పరిధిలోని చొప్పెల్ల, మడికి, చిలకలపాడు, బడుగువానిలంక, చెముడులంక, మూలస్థానం, జొన్నాడ, మల్లవానితోట, వానపల్లిలంక గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణలో భాగంగా సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు

మండపేట, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి చెప్పారు. పట్టణ 20వ వార్డులో జరుగుతున్న పారిశుధ్యం పనులను గురువారం ఆమె పరిశీలించి పారిశుధ్యం సిబ్బందికి పలు సూచనలు చేశారు.

దీనదయాళ్‌కు బీజేపీ శ్రేణుల నివాళి

రాయవరం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): సోమేశ్వరం గ్రామంలో జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతిని గురువారం నిర్వహించారు. బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు శాకా దుర్గా శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు దీనదయాళ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు చాట్రాతి జానకి రాంబాబు, కె.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మండపేట, (ఆంధ్రజ్యోతి): జనసంఘ్ వ్యవస్థాపకుడు దీన్ దయాళ్ జయంతిని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాళం పణిప్రకాష్ సారథ్యంలో గురువారం బీజేపీ శ్రేణులు నిర్వహించారు. తొలుత దీనదయాళ్ చిత్రపటానికి నేతలు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ శ్రేణులు మద్దుల సుబ్బారావు, బి.శంకర్, రామారావు, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట (ఆంధ్రజ్యోతి): పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని బీజేపీ మండల అధ్యక్షుడు సంపతి కనకేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా యువమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పాలూరి జయప్రకాశ్ నారాయణ ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోటపల్లి దామోదర్, అజ్జరపు సత్యనారాయణ, అన్యం సత్యనారాయణ పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంటే ఆరోగ్యం పదిలం

ద్రాక్షారామ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): సామూహిక శ్రమదానంతో పరిసరాల శుభ్రత, పచ్చదనంతో ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చని సత్యం ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, మున్సిపల్ చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ రాజు, జనసేన ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ అన్నారు. గురువారం స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు కళాశాలలో ఏక్ దిన్ ఏక్ గంట ఏక్ సాత్ పేరుతో సామూహిక శ్రమదానం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ శ్రీకాంత్, కళాశాల సిబ్బంది, కూటమి నాయకులు, వివిధ కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాయవరంలో స్వచ్ఛత హి సేవ ర్యాలీ

రాయవరం, (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద గురువారం స్వచ్ఛతా హీ సేవను పురస్కరించుకుని ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఎంపీపీ నౌడు వెంకటరమణ మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు, పంచాయతీ కార్యదర్శి పల్లెటి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో శ్రమదానం...

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత్సోవంలో భాగంగా గురువారం సంత మార్కెట్‌లో సర్పంచ్ బూసి జయలక్ష్మి, ఉపసర్పంచ్ విళ్ళ మారుతీప్రసాద్ తదితరులు శ్రమదానం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు బండి రాజు, బూసి భాస్కరరావు, కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్తమూరులో...

మండపేట, (ఆంధ్రజ్యోతి): అర్తమూరులో గురువారం స్వచ్ఛతా హీ సేవను నిర్వహించారు. పరిసరాల శుభ్రతతో పరిపూర్ణ ఆరోగ్యం సాధ్యమని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వీర్రెడ్డి, పడాల సుబ్బారెడ్డి అన్నారు. అర్తమూరు పాఠశాలలో కూటమినేతలు పారిశుధ్య సిబ్బందితో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో తాపేశ్వరం సహకార సంఘం అధ్యక్షుడు పడాల రామకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ: కేశవరంలో వున్న చైతన్య గ్రామీణ బ్యాంకు సిబ్బంది గురువారం గ్రామంలో స్వచ్ఛతా హీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో స్థానికులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో బ్యాంకు రీజనల్ మేనేజర్ గంటా శ్రీనువాసరావు, బ్యాంకు మేనేజర్ మురళీకృష్ణ, రీజనల్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌తో బహుళ ప్రయోజనాలు

రావులపాలెం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్‌తో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని అమలాపురం విద్యుత్ శాఖ ఈఈ కె.రాంబాబు అన్నారు. రావులపాలెంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తపేట డీఈఈ చిట్టిరాజు, రావులపాలెం ఏఈ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల దాణా సరఫరాకు చర్యలు

ఆలమూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతులకు అందుబాటు ధరలో పశువుల దాణాను అందించేలా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా పశువైద్యాధికారి కె.వెంకట్రావు తెలిపారు. ఆలమూరు పీఏసీఎస్ ద్వారా కొన్నేళ్లుగా వాటి సరఫరా జరుగుతున్న విషయాన్ని గుర్తించి జిల్లా వ్యాప్తంగా ఈ విధానాన్ని ప్రవేశ పెట్టాలని యోచిస్తున్నట్లు ఆయన అన్నారు. గురువారం ఆలమూరు సహకార సంఘంలోని పశువుల దాణాలను పరిశీలించారు. జిల్లాలో దీన్ని ప్రవేశపెట్టడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మొదటి దశలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేసి తదుపరి విస్తరిస్తామన్నారు. సహకార సంఘం అధ్యక్షుడు వంటిపల్లి సతీష్‌కుమార్, సీఈవో సుబ్రహ్మణ్యంను అభినందించారు.